ప్రజాశక్తి
శుక్రవారం 2 ఆగస్టు 2024 5
శ్రీ సత్యసాయి

పెనుకొండ మండలంలోని దుద్దేబండ గ్రామంలో పింఛనుదారులతో మాట్లాడుతున్న ఎపి సెర్ప్ సిఇఒ వీరపాండ్యన్

93.6 శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్లు పంపిణీ గురువారం ఒక్కరోజులోనే 93.6 శాతం పూర్తి అయినట్లు డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తెలిపారు. జిల్లాలో మొత్తం 2,09,207 మంది లబ్ధిదారులు ఉండగా మధ్యాహ్నం మూడు గంటలకు 2,52,16 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేశారు. 108 కోట్లా 14 లక్షలా 3600 వేల రూపాయలను ఒక్క రోజే పంపిణీ చేశారు. మిగిలినవారికి శుక్రవారం లోగా పంపిణీ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన ఎపి సెర్ప్ సీఈవో, కలెక్టర్

పెనుకొండ : మండలంలోని దుద్దేబండ గ్రామంలో ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సీఈవో వీరపాండ్యన్ పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. అలాగే పింఛనుదారుల సమస్యలపై ఆరా తీశారు. వారి వెంట డిపిఎం ఫైనాన్స్ రామిరెడ్డి, ఎపిఎంలు నాగేంద్ర, రామకృష్ణ, ఎంపీడీవో, సీసీ శ్రీనివాసులు ఉన్నారు. అలాగే వెంకటరెడ్డిపల్లిలో కలెక్టర్ టిఎస్.చేతన్, సబ్ కలెక్టర్ అపూర్వభరత్ పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు.

గుండుమల గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు, టిడిపి శ్రేణులు

ప్రజావేదిక కార్యక్రమంలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

ప్రజలందరి సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, మడకశిర

రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలియజేశారు. గురువారం నాడు శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమల గ్రామంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును పంపిణీ చేశారు. నంద్యాల జిల్లా పర్యటన ముగించుకుని శ్రీశైలం సున్నిపెంట నుంచి ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో మధ్యాహ్నం 3.45 గంటలకు గుండుమల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన గుండుమల గ్రామానికి వెళ్లారు. 4 గంటలకు గుండుమలలో ఓబులమ్మ ఇంటి వద్దకు చేరుకుని వితంతు పింఛను పంపిణీ చేశారు. పులమాసి రామన్న ఇంటి వద్దకెళ్లి వద్ధాప్య పింఛన్ అందించారు. అనంతరం మల్బరీ ప్లాంటేషన్ షెడ్‌ను సందర్శించి పట్టు రైతుతో మాట్లాడారు. అక్కడి నుంచి గుండుమలలో వడిసలమ్మ, కరియమ్మ దేవి దేవాలయాలను సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. పింఛన్‌దారుల ఇంటికెళ్లి వారి కష్టాలు విన్న ముఖ్యమంత్రి రామన్నకు భూమితో పాటు, వారి బిడ్డలకు ఉపాధి కల్పిస్తామని, ఓబుళమ్మకు ఇల్లు కట్టించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ చేతన్‌కు ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ముఖ్యమంత్రిగా తొలిసారి జిల్లాకు వచ్చిన చంద్రబాబుకు గుండుమలలో కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ముఖ్యమంత్రి పర్యటన అంతా వర్షం నడుమే సాగింది.

ఓబుళమ్మకు వితంతు పింఛను అందిస్తున్న చంద్రబాబు

పట్టు రైతుల సమస్యలపై ఆరా

చంద్రబాబు నాయుడు పట్టు రైతు రంగనాథతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పట్టు రైతులు, రీలర్లకు అంతకు మునుపు ఇచ్చే సబ్సిడీ గడిచిన ఐదేళ్లుగా ఇవ్వలేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి రైతు తీసుకొచ్చారు. మల్బరీ షెడ్డు నిర్మాణానికి కొన్ని నిబంధనలు ఇబ్బందికరంగా ఉన్నాయని, వాటిని మార్చాలని హిందూపురం ఎంపి బికె.పార్థసారధి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వక్క రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వక్క పంట ఇక్కడ ఉందని, అయితే మార్కెటింగ్ సౌకర్యం స్థానికంగా లేదని వక్క రైతులు ఆయనకు తెలియజేశారు. మార్కెటింగ్ సౌకర్యంతోపాటు, డ్రిప్ సబ్సిడీతో అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, హిందూపూర్ ఎంపీ బికె.పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కలెక్టర్ టిఎస్.చేతన్, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి ఆర్డీవో సౌభాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు మడకశిర పర్యటనకు వస్తున్న సందర్భంగా ఆయనకు స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్టు వద్ద వేచి ఉన్న ఉమ్మడి జిల్లా టిడిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు, తెలుగుదేశం పార్టీ నాయకులు

వర్షంలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

మడకశిరకు పలు హామీలు

సత్యసాయి జిల్లా తొలి పర్యటనలో మడకశిర ప్రాంతానికి చంద్రబాబు హామీల వర్షం కురిపించారు. ఎఫ్‌పిఒల ద్వారా వక్క రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా కింద మడకశిర ప్రాంతంలో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తామని తెలిపారు. రాళ్ల అనంతపురం వద్ద 1600 ఎకరాల సేకరించిన భూమిలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. వక్క, పట్టు రైతులను ఆదుకుంటామని హామీనిచ్చారు. మడకశిర ప్రాంతంలో కర్నాటక హిరియుర్ నుంచి పెనుకొండ మీదుగా పుట్టపర్తికి కలిపే జాతీయ రహదారి ఏర్పాటుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ద్వారా సాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

- 'వక్క'కు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం
- మడకశిరలో హంద్రీనీవా కింద రెండు రిజర్వాయర్లు
- పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు
- గుండుమలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ

పింఛన్లు ప్రవేశపెట్టింది టిడిపి ప్రభుత్వమే

బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో ప్రప్రథమంగా సామాజిక భద్రత పింఛన్లను ప్రవేశపెట్టింది టిడిపి ప్రభుత్వమే అని, గడప గడపకూ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన ఘనత ఎన్‌డిఎ ప్రభుత్వానిదని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. మంత్రి గురువారం ఉదయం నుంచే మండలంలోని వెంకటరెడ్డిపల్లి, కురుబవాండ్లపల్లి, గుట్టూరు గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి వృద్ధులు, వికలాంగులు, వితంతు వులు, ఒంటరి మహిళ, తదితర పింఛన్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 64, 82,000 మంది పింఛనుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో రూ. 1000 పెంచడానికి జగన్‌కు ఐదేళ్లు పట్టిందన్నారు. సిఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెల నుంచే పింఛను మొత్తం రూ. 4 వేలకు పెంచి ఇంటి వద్దనే అందిస్తున్నార న్నారు. ఇచ్చిన మాట నిలుపుకొనే గొప్ప వ్యక్తి చంద్రబాబు అని ఇచ్చిన మాట తప్పడం జగన్ నైజం అని విమర్శిం చారు. మంత్రి వెంట కూటమి నాయకులు ఉన్నారు.

జడ్పీ హైస్కూల్ తనిఖీ

మండలంలోని గుట్టూరు జడ్పీ హైస్కూల్‌ను మంత్రి సవిత సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం అమలు ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. మాజీ సర్పంచి సూర్య నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు డైరీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మునిమడుగు వెంకటరాముడు, సుబ్బరాయుడు, నాగరాజు, శేషు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మంత్రి హర్షం

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతూ ఏ కులంలో ఉన్నా పేదలకు న్యాయం జరగాలన్నదే సిఎం చంద్రబాబు లక్ష్యం అన్నారు. అన్ని కులాల్లోని పేదలు ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థానాల్లో ఉండాలన్నది టిడిపి ధ్యేయం అన్నారు. దళితులు, గిరిజనుల అభివృద్ధి విషయంలో టిడిపి ఎప్పుడూ ముందుంటుందన్నారు. చంద్రబాబు ఏనాడో ఎస్సీలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరణ చేశారన్నారు. ఆ నిర్ణయం సరైనదేనని సుప్రీం కోర్టు తీర్పుతో రుజువైందన్నారు.

వికలాంగురాలికి పింఛను సొమ్ము అందజేస్తున్న బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత

కూటమి ప్రభుత్వంలోనూ ఆగని ముందస్తు అరెస్టులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

కూటమి ప్రభుత్వంలోనూ ప్రశ్నించే నాయకుల గొంతు నులిమే చర్యలు ఆగడం లేదు. వామపక్ష, ప్రజాసంఘాల నాయకుల అరెస్టుల విషయంలో గత ప్రభుత్వ విధానాలే ఈ ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి పర్యటన చేస్తున్నారంటే ఎక్కడికక్కడ సిపిఎం, ఇతర వామపక్ష నాయకుల్ని అరెస్టు చేయడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అదే పద్ధతి కొనసాగుతోంది. తాజాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం నాడు మడకశిర నియోజకవర్గం గుండమల పర్యటనకు విచ్చేవారు. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ఎక్కడెక్కడ నోటీసులు ఇచ్చి గహ నిర్బంధం చేశ్శారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సోమందేపల్లి సిపిఎం మండల కమిటీ సభ్యులు రమేష్, గంగాధర్ తదితరులను తెల్లవారు జామున 3.30 గంటలకు పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసేంత వరకు స్టేషన్‌లో ఉంచుకుని తర్వాత వదిలేశారు. ఈ అక్రమ అరెస్టులపై సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులతో ప్రశ్నించే గొంతుకులను ఆపలేరన్నారు.

ముందస్తు అరెస్టులను ఖండించిన వ్యకాసం

రొద్దం : సిఎం చంద్రబాబు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమి టీ సభ్యులు నారాయణను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని వ్యకాసం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిం చింది. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ సిఎం పర్యటన సందర్భంగా ప్రజా సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం తరహా లోనే ఈ ప్రభుత్వం కూడా ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి అవకాశం ఇవ్వడం లేదన్నారు. పేదలు, వ్యవసాయ కూలీలు, రైతులు, ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం ద్వారా ఉద్యమాలను ఆపలేరన్నారు. గోరంట్ల మండలంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు నార్సింపల్లి, ఆంజనేయులుకు ఇంటి వద్ద ముందస్తు అరెస్ట్ నోటీసు ఇవ్వడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేయడంపై పెట్టిన శ్రద్ధ సూపర్ సిక్స్ హామీల అమలుపై పెట్టాలని హితవు పలికారు. పోలీసుల అక్రమ అరెస్టులతో ఎంతో కాలం పాలన సాగించలేరని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అరెస్ట్ చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ముందస్తు అరెస్టుల నేపథ్యంలో పోలీసు స్టేషన్‌లో ఉన్న సిపిఎం నాయకులు

పింఛను పంపిణీలో పాల్గొన్న ఎంపి

ప్రజాశక్తి-రొద్దం

హిందూపురం ఎంపి బికె.పార్థసారథి గురువారం మండలంలోని కలిపి గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. అలాగే చెరుకూరు గ్రామంలో చౌక దుకాణాన్ని ప్రారంభించి రేషన్‌కార్డుదారులకు బియ్యం అందజే శారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, నాయకులు చిన్నప్పయ్య, చౌడప్ప, రాము, అధికారులు, పంచా యతీ కార్యదర్శి సుధాకర్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎంపి పరామర్శ

మండలంలోని కలిపి గ్రామంలో టిడిపి కార్యకర్త భాను అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే హిందూపురం ఎంపి బికె పార్థసారథి ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టిడిపి సీనియర్ నాయుకులు మాధవనాయుడు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, మండల కన్వీనర్ నరహరి, వీరాంజి, కూటమి నాయకులు ఉన్నారు.



వృద్ధుడికి పింఛను సొమ్ము అందజేస్తున్న ఎంపి బికె.పార్థసారథి

చిన్నారులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన దాతలు

అంగన్వాడీ కేంద్రంలో స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని గుడిపల్లి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. బెంగళూరుకు చెందిన జిఎన్‌వి.శాంతమ్మ, రంగయ్యశెట్టి జ్ఞాపకార్థం వారి కుమారులు జి.మురళి, జి.సత్యనారాయణలు ఐసీడీఎస్ సిడిపిఒ అనురాధ ఆధ్వర్యంలో పిల్లలకు బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, జామెట్రీ బాక్సులు, వాటర్ బాటిల్స్, తదితర వస్తువులను పంపిణీ చేశారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలో రూ. 30 వేలు విలువ చేసే నీటి మోటార్, స్టాటర్ బాక్సు పంపిణీ చేశారు. అంగన్వాడీ సెంటర్‌లో 30 మంది చిన్నారులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సజ్జగంట రఘునాథ స్వామి ఆలయ పురోహితులు శ్రీనివాసరావు, మాజీ సర్పంచి రంగప్ప, అంగన్వాడీ యూనియన్ నాయ కురాలు శ్రీదేవి, టిడిపి నాయకుడు రమణ, అంగన్వాడీ కార్యకర్తలు నాగరత్న, శోభారాణి, చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అధికార ఆక్రమణ..!

- రూ.2 కోట్లు విలువజేసే భూమిపై పెద్దల కన్ను
- నకిలీ పత్రాలతో పాసుపుస్తకాల సృష్టి
- అక్రమాలకు రెవెన్యూ అధికారుల సాయం.?
- న్యాయం కోసం బాధితుడు వేడుకోలు

కదిరిలో గత వైసిపి పాలనలో జరిగిన భూ కబ్జాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పెద్ద ఎత్తున భూములను లాగేసుకునే ప్రయత్నం జరిగినట్లు కన్పిస్తోంది. తాజాగా ఓ వ్యక్తికి వంశపార్యపరంగా సక్రమించిన రూ.2 కోట్ల విలువజేసే భూమిని నకిలీ పత్రాలతో అప్పటి ముఖ్య నేతలు లాగేసుకునే కుట్ర చేశారు. బాధితుడు తనకు న్యాయం చేయాలంటూ అధికారులను వేడుకుంటున్నారు. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి గ్రామ పొలంలోని సర్వేనెంబర్ 316-2లో మొత్తం 5.77 సెంట్ల స్థలం ఉంది. అందులో కుటాగుళ్లకు చెందిన బొగనాథం రామలింగయ్య శెట్టి తండ్రి నారాయనప్ప శెట్టి భార్య కొనమ్మల నుంచి వారసత్వంగా సాయినాథ గుప్తకు 1.44 సెంట్ల స్థలం వచ్చింది. ఈ స్థలం అనంతపురం - చెన్నై జాతీయ రహదారి పక్కన, కదిరి మున్సిపాల్టీకి సమీపాన ఉంది. దీంతో ఈ భూమి విలువ రూ.2 కోట్లకు పైగానే ఉంది. భూమి సాగులో లేకుండా బంజరుగా ఉండడంతో దీనిపై అప్పటి వైసిపి నేత కన్ను పడింది. ఎలాగోలాగా ఆ భూమిని దక్కించుకోవాలన్న భావనతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కుట్రకు తెరలేపారు. సాయినాథ్ గుప్తాకు చెందిన 1.44 ఎకరాల భూమిని మొదటిగా సదరు నాయకుడు తన బంధువుల పేరిట అగ్రిమెంట్ సష్టించారు. అగ్రిమెంట్ ద్వారా పాసుపుస్తకాలను మంజూరు చేయించుకున్నారు. అధికార పార్టీ నేత చెప్పడంతో రెవెన్యూ అధికారులు సైతం దేనినీ పట్టించుకోకుండా నిబంధనలన్నింటినీ పక్కన పడేసి పాసుపుస్తకాలు తయారు చేయించి ఇచ్చారు. ఇలా బంధువుల పేరుపై పాసుపుస్తకం రాగానే వెంటనే ఆ భూమిని సదరు నాయకుడు తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ అక్రమ భూ వ్యవహారంపై చర్చ మొదలైంది. దీంతో సదరు నేత కోట్ల విలువజేసే ఆ భూమిని గుట్టు చప్పుడు కాకుండా అమ్మేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

అధికారుల అడ్డగోలు వ్యవహారం..!

స్వతహాగా వంశపార్యం పరంగా సంక్రమించిన ఆస్తిని ఇతరులపై పాస్ బుక్ మంజూరు చేసేందుకు పలు నిబంధనలు ఉన్నాయి. వంశవక్షం, వన్‌బి, పాస్‌బుక్, కొనుగోలు చేసినట్లయితే గత రిజిస్టర్ పత్రాలు, ప్రస్తుత రిజిస్టర్ పత్రాలు, ప్రస్తుత ఈసీ, నకలు ఇవన్నీ పరిశీలించాకే అధికారులు కొత్త పాస్‌బుక్‌ను మంజూరు చేయాల్సి ఉంది. సాయినాథ్‌గుప్తా భూమి విషయంలో రెవెన్యూ అధికారులు ఈ రికార్డులను పరిశీలించకుండానే అడ్డగోలుగా అతని భూమిని మరొకరి పేరుపై మార్చి పాసుపుస్తకం మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

కదిరిలో కబ్జాలపై ఎమ్మెల్యే కొరడా

గత ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కదిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రభుత్వ, ప్రయివేటు భూముల కబ్జాలు, ఆక్రమణలపై దృష్టి సారించారు. ఆక్రమణల్లో ఉన్న భూములను వెనక్కు తీసుకుని బాధితులకు న్యాయం చేసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో కబ్జాదారులు గుట్టు చప్పుడు కాకుండా భూములను అమ్మేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం

నా భూమి నాకు ఇప్పించండి

కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి సమీపన సర్వే నెంబర్ 316-2లో 5.44 పైకి 1.44 సెంట్ల భూమి దశాబ్దాల నుంచి తమ పెద్దల వారసత్వంగా తనకు సంక్రమించింది. ఈ భూమికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తోంది. అయినప్పటికీ కొందరు స్వార్థపరులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అధికారులను లోబర్చుకుని ఆన్‌లైన్‌లో తన పేరును తొలగించారు. వారి పేరుపై నకిలీ పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయించుకున్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాను. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తన భూమి తనకు చెందేలా చొరవ చూపాలి.

సాయినాథ్ గుప్తా, బాధితుడు.

మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల పరిశీలన

రొద్దం : మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలను గురువారం టిడిపి మండల నాయకులు సందర్శించారు. వారు ప్రిన్సిపల్ శోభారాణితో కలిసి తరగతి గదులు, బాత్‌రూమ్‌లు, తదితర వాటిని పరిశీలించారు. ప్రిన్సిపల్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు మాట్లాడుతూ ఆయా సమస్యలను మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు మాధవనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, చంద్రశేఖర్, వీరాంజి, హరీష్, రుద్ర, రామాంజి, క్రిష్టప్ప, సిద్దన్న, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో సభ్యత్వాలు పెంచాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

గ్రంథాలయాల్లో సభ్యత్వాలు పెంచేలా కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ముఖ్య కార్యదర్శి రమా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ధర్మవరంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన గ్రంథాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. గ్రంథాలయములోని పలు రికార్డులను పరిశీలించారు. పాఠకులకు కావలసిన అన్ని రకాల పుస్తకాలను గుర్తించి, తెప్పించాలని సూచించారు. దాతల ద్వారా కూడా పలు కార్యక్రమాలను నిర్వహించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది సత్యనారాయణ, రమణ, శివమ్మ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ధర్మవరం టౌన్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గ్రామ ప్రజలకు పూర్తి దశలో అవగాహన కల్పించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని జిల్లా మలేరియా సబ్‌యూనిట్ అధికారి డాక్టర్ కుళ్లాయప్ప నాయక్, సహాయక మలేరియా యూనిట్ అధికారి లక్ష్మీ నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మండల పరిధిలోని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఓబుల నాయన పల్లి తండాలో గురువారం పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాం నాయక్, సూపర్వైజర్ రాజశేఖర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఎఎన్ఎం శివలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి భారతి, ఆశాలు పాల్గొన్నారు.

In the Court of The Senior Civil Judge:Penukonda

I.A No:75/2023 in O.S.No:59/2017

Between:
1.Vaddi Nagappa @ Penukonda Nagappa died by L.Rs
2.Penukonda Venkatesu
3.Penukonda Ravindra
4.P.Peddakka ...Petitioners

V/S

1.Gorantla Obulesu
2.Gorantla Nagaraju
3.Gorantla Obulamma died by L.Rs
4.Ramanjamma
5.Aruna ...Respondents

Notice To Respondent No:5

Aruna W/o Aswarthanarayana, Paipalli Puttaparthi Mandal, Sri Sathya sai Dist.

ఇందుమూలంగా మీకు తెలియజేయడం ఏమనగా పై దావాలో గోరంట్ల ఒబులమ్మ చనిపోయిన కారణంగా మిమ్ములను ఆమె వారసురాలుగా పై దావాలో చేర్చుటకు గాను, దాఖలు చేసిన పిటీషన్‌లో మీ హాజరు నిమిత్తమై పై కేసు 09/08/2024 నాటికి వాయిదా పడినది. కావున ఆ రోజు మీరు 10:030 గంటలకు పై కోర్టులో హాజరు కావలయును. రానిచో పై కేసు మీ పరోక్షముగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

యల్.విశ్వనాథ్,
అడ్వకేట్, పెనుకొండ

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

I.A.NO:19/2022 in I.P.NO:1/2015

Between:
గజ్జల గోవిందరెడ్డి S/o నారాయణరెడ్డి, జీనులకుంట, గాండ్లపెంట అనంతపురం జిల్లా. ...పిటిషనరు

మరియు

రాళ్లపల్లి అల్లాబక్స్ మరియు ఇతరులు ...ప్రతివాదులు

5 నుండి 9వ ప్రతివాదులకు ఇన్సాల్వెన్సీ పిటిషన్ నోటీసులు

R5:రాళ్లపల్లి హనీపా D/o రాళ్లపల్లి అల్లాబక్స్,
R6:రాళ్లపల్లి అమ్మాజాన్ D/o రాళ్లపల్లి అల్లాబక్స్,
R7:రాళ్లపల్లి పైరోజా D/o రాళ్లపల్లి అల్లాబక్స్,
R8:రాళ్లపల్లి మున్నీ D/o రాళ్లపల్లి అల్లాబక్స్,
R9:రాళ్లపల్లి ఖలంధర్ S/o రాళ్లపల్లి అల్లాబక్స్,
జీనులకుంట గ్రామం, గాండ్లపెంట మండలం, అనంతపురం జిల్లా.

అను మీపైన పిటిషనర్ అయినటువంటి గజ్జల గోవిందరెడ్డి, పైవారి కోర్టునందు దాఖలు చేసిన ఇన్సాల్వెన్సీ పిటిషన్‌లో మరణించిన 1వ ప్రతివాది ఆర్.అల్లాబక్స్ వారసులుగా మిమ్ములను చేర్చుటకు అర్జీ దాఖలు చేసి యున్నారు.సదరు పిటిషన్‌లో మీ హాజరు నిమిత్తం 08/08/2024 వాయిదా ఉన్నది. సదరు వాయిదా తేదిన మీరు ఉదయం 10:30 గంటలకు, హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు గాని యెడల మీ పరోక్షంలో తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:08/08/2024
స్థలం:కదిరి

వి.ప్రసాద్ రెడ్డి, బి.ఎ.బి.ఎల్,
పిటిషనర్ తరుపు న్యాయవాది, కదిరి

మహారాజశ్రీ పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.NO:595/2023 in O.S.NO:60/2017

Between:
వి.ఎర్రిస్వామి ...అర్జీదారు-వాది

మరియు

1.ఎ.హేమలత
2.ఎ.ఉమా ...రెస్పాండెంట్లు-ప్రతివాదులు
3.దొరన్నగారి నాగరాజు
4.పి.ఆర్.మారుతి
5.వై.బాబుసాబు ...ప్రొ-రెస్పాండెంట్లు

To
3.దొరన్నగారి నాగరాజు S/o డి.లక్ష్మయ్య, వయస్సు 44 సం॥లు, D.No:1/241/2, ఆలివన్ కాలనీ, పెనుకొండ.
4.పి.ఆర్.మారుతి S/o లక్ష్మన్న, వయస్సు 36 సం॥లు, D.No:1/134, కురుబవాండ్లపల్లి, పెనుకొండ.
5.వై.బాబుసాబు S/o ఇమాంసాబు, వయస్సు 38 సం॥లు, D.No:1/47, కొట్లపల్లి, పుట్టపర్తి మండలం.

NOTICE

పై I.A. నందు 3,4,5, ప్రొ-రెస్పాండెంట్లు అయిన మీకు తెలుపునది ఏమనగా, పై దావాలోని అర్జీదారు-వాది మిమ్ములను, పై దావాలో ప్రతివాదులుగా చేర్చుటకు గాను I.A.NO:595/2023 దాఖలు చేసి వున్నారు.సదరు I.A.మీ హాజరు గాను 08/08/2024వ తేదిన వాయిదా వున్నది. వాయిదా రోజున మీరు పై కోర్టు వారి ఎదుట ఉదయం 10 గం॥లకు వకీలు ద్వారా గానీ ఖుద్దున గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని పరోక్షంలో సదరు I.A.NO:595/2023 మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలుపడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

సి.ఆర్.నాగార్జున,
అర్జీదారు-వాదిపరం వకీలు

DHARMAVARAM MUNICIPALITY

IFB Tender Notice No.490 & 491/Desiltation Funds/E1/2024-25.

'e' procurement Tender Notice No. 490 & 491/Desiltation Funds/E1/2024-25 With value of work Rs.13.80 Lakhs & Rs.23.15 Lakhs & Details of name of work, Tender document, Eligibility Criteria, Bid Submission & Price bid opening date and EMD details etc., may be seen on 'e' procurement website - **https://tender.apeprocurement.gov.in.**

Commissioner,
Dharmavaram Municipality.

ప్రజా సంఘాల నాయకుల ముందస్తు అరెస్టులు సిగ్గుచేటు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

పెనుకొండ పోలీసుస్టేషన్‌లో నాయకుల నిర్బంధం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో ప్రజాసంఘాల నాయకులను ముందుస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారిన అదే తీరు కొనసాగుతోందన్నారు. మొదటిసారి ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పింఛన్ల పంపిణీలో పాల్గొనడానికి వస్తున్న తరుణంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గత ప్రభుత్వ వైఖరినే ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తోందని విమర్శించారు. పేదలు, వ్యవసాయ కూలీలు, రైతులు, ప్రజా సమస్యల గురించి ప్రశ్నించే నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు. పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట రాముడు, సిపిఎం నాయకులు రమేష్ , రొద్దం మండలం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, మడకశిర ప్రాంతంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారని అన్నారు. గోరంట్ల మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నార్సింపల్లి ఆంజనేయులును ఇంటి దగ్గర ముందస్తు అరెస్ట్ నోటీసు ఇచ్చారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ముఖ్యమంత్రి పర్యటన చేస్తున్నారంటే ఎక్కడికక్కడ సిపిఎం, ఇతర ప్రజా సంఘాల నాయకుల్ని అరెస్టు చేశారని ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఆ ప్రభుత్వ పద్ధతినే కొనసాగించడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేయడం పట్ల ఉన్న శ్రద్ధ ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలు అమలుపై చూపడం లేదని ఎద్దేవా చేశారు. ఎంతోకాలం పోలీసుల అక్రమ అరెస్టులతో పాలన కొనసాగించలేరని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అరెస్ట్ చేసిన నాయకులను తక్షణం విడుదల చేసి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు

లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తున్న పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఎమ్మెల్యేలు పల్లె సింధూర, కందికుంట, సత్యకుమార్

ప్రజాశక్తి -కొత్తచెరువు

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు మండల పరిధిలోని బండ్లపల్లి పంచాయతీలోని అప్పలవాండపల్లిలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. గ్రామంలో ఉదయం ఆరు గంటలకే ఇంటింటికి వెళ్లి వద్దులకు వికలాంగులకు వితంతువులకు పింఛను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కిష్టప్ప, కేసప్ప, టిడిపి నాయకులు భక్తవత్సలం నాయుడు, సురేష్, గాజుల చంద్రమోహన్, బైరాపురం లక్ష్మీనారాయణ, సూరి, ఎంపీడీవో మహబూబ్ అలీ, కార్యదర్శి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ముఖంలో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కదిరి పట్టణంలోని 13, 14 ,15 వార్డులలో టిడిపి పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇంటింటా తిరుగుతూ లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెంచిన పింఛన్లను నెలనెలా ఒకటో తేదీన ఇంటివద్దకు వెళ్లి అందజేయడానికి చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్లు మహబూబ్, సావిత్రమ్మ, మాజీ కౌన్సిలర్ అయూబ్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ప్రజా సంక్షేమం కోసం ఎన్‌డిఎ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని 22వ వార్డులో మంత్రి సత్యకుమార్, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య తదితరులు గురువారం ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం వార్డుల్లో ప్రజలతో అర్జీలు స్వీకరించారు.

పుట్టపర్తి రూరల్ : పింఛన్ల పెంపుదలతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూస్తున్నామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లిలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండల వ్యాప్తంగా ఇంటివద్దనే పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సత్యనారాయణ, కన్వీనర్ గోవింద్ రెడ్డి, మాజీ సర్పంచి శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల వ్యాప్తంగా మొదటిరోజే 96.88 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ జిఎన్ఎస్. రెడ్డి తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 5 గంటల నుండి పింఛన్లు ప్రారంభించామన్నారు. మండల వ్యాప్తంగా 9962 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారని సిబ్బంది ద్వారా 96.88 శాతం పింఛన్లు పంపిణీ చేశామని చెప్పారు.

రైతాంగ సమస్యలపై కేంద్రాన్ని నిలదీద్దాం

ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు

రైతులతో కలిసి నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

దేశ వ్యాప్తంగా రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి రైతులు సిద్ధం కావాలని ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ఆందోళనలో భాగంగా పట్టణంలోని పట్టు గూళ్ల మార్కెట్ వద్ద రైతులతో కలిసి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్, బిఎస్‌పి రాష్ట్ర నాయకులు శ్రీరాములు, రైతు సంఘం నాయకులు జయ రామిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. డాక్టర్. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం పంటలకు ధరలు నిర్ణయించాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2020ని రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశంలో స్వామినాథన్ సిఫార్సును చట్టంగా చేసి, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రవి కుమార్, పట్టు గూళ్ల వీవర్స్ అసోషియేషన్ మొండ్ అన్వార్, ఖలీల్ బాషా, ఖాజా, పట్టు రైతులు చైతన్య సంస్థ సభ్యులు, ముస్లిం నగారా సభ్యులు, టిప్పు సుల్తాన్ రక్తదాన సంఘం షేక్ షబ్బీర్, మైనారిటీ నాయకుడు దాదు, కిసాన్ సంఘం నాయకులు పలవీందర్సింగ్, భగవాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ముఖ్యమంత్రి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సత్యసాయి జిల్లా పర్యటన అనంతరం సత్యసాయి విమానాశ్రయంలో ఆయన కు టిడిపి నాయకులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం మడకశిర మండల కేంద్రంలోని గుండుమల లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో సాయంత్రం 6:05 గంటలకు సత్యసాయి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్, అనంతపురం ఎస్పీ మురళీకృష్ణ, డిఆర్ఒ కొండయ్య తో పాటు తదితరులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు. అనంతరం 6:15 గంటలకు ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి విజయవాడకు వెళ్లారు.

నిరాశకు గురైన తెలుగు తమ్ముళ్లు

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛాలు అందించాలని ఆశించిన తెలుగు తమ్ముళ్లకు నిరాశే ఎదురైంది. వారిని విమానాశ్రయంలోకి పోలీసులు అనుమతించలేదు. దీంతో ఒక దశలో టిడిపి నాయకులు పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు అనుమతించకపోవడంతో తెలుగు తమ్ముళ్ల నిరాశతో వెనుతిరిగారు.

అభివాదం చేస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

కరపత్రాలు విడుదల చేస్తున్న మంత్రి సత్యకుమార్, తదితరులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని సాయినగర్ లోని పిహెచ్‌సిలో నిర్వహించిన ప్రపంచతల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య పాల్గొని తల్లిపాల వారోత్సవాల కరపత్రాలను విడుదలచేశారు. తల్లిపాలపై అవగాహన పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఏటా వారోత్సవాలను నిర్వహి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు పరిశేసుధాకర్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : తల్లిపాలలో ఎన్నో పోషక విలువలు ఉంటాయని బిడ్డ మనుగడకి తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు తెలిపారు. ఈ మేరకు వారు మండల పరిధిలోని కొట్లపల్లి. నిడిమామిడి గ్రామాల్లోని అంగనవాడి కేంద్రాలలో అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మునిచంద్రిక ఆద్వర్యంలో తల్లి పాల విశిష్టితను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పౌష్టికాహారం గురించి వివరించారు. 104 సర్వీసును వినియోగించుకొని ప్రతిఒక్కరు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని కోరారు .ఈ కార్యక్రమములో సి హెచ్ఒ నగేష్, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఆరోగ్య కార్యకర్త శివ, మంజులవాణి, ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, విజయ్‌భాస్కర్, అంగనవాడీలు వేదవతి, నాగమణి, ఆశా కార్యకర్తలు నిర్మల, మమతాజ్, రత్నమ్మ, హసీనా, పార్వతమ్మ, 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : నవజాత శిశువులకు తల్లి పాలు శ్రేయస్కరమని బత్తలపల్లి ఆర్డీటి వైద్యులు డాక్టర్ రేణుక, డాక్టర్ సునీల్, నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్ లక్ష్మి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఆర్డీటి ఆసుపత్రి నుంచి బత్తలపల్లి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

లేపాక్షి : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక నంది విగ్రహం నుంచి పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీడీపీఓ రెడ్డి రమణమ్మ, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, డాక్టర్ చిరంజీవి హాజరయ్యారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అతిథులు మాట్లాడుతూ ప్రతి బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమన్నారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తల్లి పాల ద్వారా బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తద్వారా పిల్లలు అనా రోగ్యం బారిన పడకుండా ఉంటారన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, మంజుల, జయమ్మ, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని బుగ్గానిపల్లి, మల్లాపల్లి, కళ్లగేరి, గోరంట్ల-7, మార్కెట్ వీధిలోని అంగన్వాడీ కేంద్రాలను సోమందేపల్లి సిడిపిఒ అనురాధమ్మ సందర్శించి ఆహార పదార్థాల నిల్వలు, పిల్లల రిజిస్టర్లను తనిఖీ చేశారు. గోరంట్ల-7 అంగన్వాడీ సెంటర్‌లో తల్లిపాల ప్రాముఖ్యతపై సిడిపిఒ అనురాధమ్మ అవగాహన కల్పించారు. అలాగే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు పంపిణీ చేయాలన్నారు. ప్రీ స్కూల్ సజావుగా నిర్వహించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరపాల న్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు నాగరాణి, రజిత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని అప్పలవాండ్లపల్లి గ్రామం వద్ద కొత్తచెరువు - పెనుగొండ ప్రధాన రహదారిలో బుధవారం రాత్రి ఆటో ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కొత్తచెరువు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉన్నరప్పపల్లికి చెందిన సాయికుమార్ (28) అనే యువకుడు కియా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. పుట్టపర్తిలో నివాసం ఉంటూ ప్రతిరోజు ద్విచక్ర వాహనంపై కియా పరిశ్రమకు వెళ్లి వచ్చేవాడు. ఇదే తరుణంలో బుధవారం రాత్రి విధులు ముగించుకొని వస్తున్న తరుణంలో అప్పలవాండ్లపల్లి గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయికుమార్ తలకు తీవ్ర గాయం కావడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందజేయడంతో కొత్తచెరువు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి...

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన రామాంజనేయులు(54) ధర్మవరం రైల్వేస్టేషన్‌లో గురువారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన రామాంజినేయులు బెంగుళూరులో బార్బర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో పీర్లపండగకు స్వగ్రామానికి వచ్చాడు. తిరిగి గురువారం బెంగుళూరుకు వెళ్లేందుకు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. ఉన్నఫళంగా ఛాతిలో నొప్పి రావడంతో రైల్వేస్టేషన్‌లో కిందికిపడిపోయాడు.. గమనించిన తోటి ప్రయాణికులు పోలీసుల సహాయంతో ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారు. మ తునికి భార్య సరోజ, ఒక కూతురు ఉంది.ఈ మేరకు రైల్వేపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాడిఆవు మృతి

గుడిబండ : మండలంలోని బల్లెకట్ట గ్రామంలో గురువారం రూ. 1.2 లక్షల విలువ చేసే ఆవు మృతి చెందినట్లు రైతు వాపోయాడు. బాధిత రైతు మాట్లాడుతూ ఆవు రోజుకు 12 లీటర్ల పాలు ఇచ్చేదని, ఈ ఆవు మృతి చెందడంతో జీవనాధారం కోల్పోయానని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. గుడిబండ పశు వైద్య కేంద్రంలో చాలా రోజులుగా డాక్టర్ లేక ఆవులు, గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గుడిబండ పశు వైద్యశాలకు వైద్యుడిని నియమించాలని పాడి రైతులు కోరుతున్నారు.

సిఎం పర్యటన విజయవంతంపై ఎస్పీ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన విజయవంతం చేయడం పట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం, అధికారులు, ప్రజాప్రతినిధులకు జిల్లా ఎస్పీ వి .రత్న కృతజ్ఞతలు తెలిపారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం పర్యటనలో పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా భద్రతపరంగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం, అన్ని శాఖల అధికారులు , ప్రజాప్రతినిధులు సహకారంతో సిఎం పర్యటన విజయవంతం కావడం పట్ల ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్, ప్రాథమిక ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో, విద్యా కమిటీల ఎంపిక కోసం ప్రభుత్వ నోటిఫికేషన్ వెలువడిందని ఎంఇఒ జయచంద్ర తెలిపారు. ఈసందర్భంగా ఆయన గురువారం గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల ఎర్రబెల్లి ప్రాథమిక పాఠశాల, కోడపగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కమిటీ ఎన్నికల కోసం నోటీస్ బోర్డులలో ఓటర్ జాబితాను ప్రదర్శించాలని సూచించారు.

బత్తులపల్లి : మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటి(ఎస్ఎంసి) ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రకటన విడుదల చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు చాముండేశ్వరి. సుధాకర్ నాయక్ తెలిపారు. స్థానిక మండల విద్యాధికార్యాలయంలో గురువారం స్కూల్ మేనేజ్మెంట్ కమిటి ఎన్నికలకి సంబంధించిన విధివిధానాలను ప్రదానోపాధ్యాయులకు అందజేసి వివరాలను వెల్లడించారు. ఈ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని వారు రోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

4న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కదిరిగేటు వద్దగల కేశవనగర్ లోని వాసవీ బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా న్యూరాలజీ, కార్డియాలజీకి సంబందించి ఉచిత వైద్యశిబిరాన్ని ఈనెల 4న నిర్వహించనున్నట్టు సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఉచిత వైద్యశిబిరానికి సంబందించిన కరపత్రాలను సొసైటీ సభ్యులు గురువారం విడుదల చేశారు. మరిన్ని వివరాలకోసం 9494018465 సంప్రదించాలన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా గోవిందు

ప్రజాశక్తి - నల్లమాడ

సిపిఎం మండల కార్యదర్శిగా గోవిందును ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని నాగలకట్ట వీధి లో శివాలయంలో గురువారం సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోవిందును మండల కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, రామాంజనేయులు, గంగులప్ప, రామన్న, రామకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి సమస్యలపై చంద్రబాబుకు వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండలంలో నెలకొన్న సమస్యలు, మున్సిపాలిటీలో జరిగిన అవకతవకలపై తెలుగుదేశం మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి చంద్రబాబుకు విన్నవించారు. సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన పలు విషయాలను విన్నవించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల మరమ్మతులకు, నూతన రోడ్ల ఏర్పాటుకు రోడ్లు వేయకనే బిల్లులు దండుకున్నారని, పురపాలక సంఘంలో ప్రజలకు చెత్తబుట్టలు పంపిణీ చేయకనే చేసినట్లు చూపి బిల్లులు కాజేశారని, పారిశుధ్య విభాగంలో ఆరు యంత్రాలను కొనుగోలు చేసి వాటితో పని చేయకుండా మూలన పడేశారని వాటి మరమ్మత్తుల కోసం ఐదు లక్షల రూపాయలు బిల్లులు మంజూరు చేశారని ఫిర్యాదు చేశారు. పుట్టపర్తి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా సిఎంపను ఆయన కోరారు.

శస్త్ర చికిత్స పరికరాలు అందజేత

ప్రజాశక్తి - కదిరి టౌన్

రోటరీ క్లబ్ ఆఫ్ కదిరి పూర్వపు కార్యదర్శి డాక్టర్ సివి మదన్ కుమార్ కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ విభాగానికి సంబంధించిన రూ. 35 వేలు విలువ చేసే 100 శస్త్ర చికిత్స గౌనులు, మాస్కులను హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎమ్‌డి హుస్సేన్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హుసేన్ మాట్లాడుతూ కదిరి ప్రాంతం చాలా వెనుకబడిన ప్రాంతమని, ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ వలన భాదితులు సంఖ్య ఎక్కువగా ఉండటంతో అనేక మంది కిడ్నీ సంబంధిత వ్యాధి బారిన పడుతున్నారని చెప్పారు. ఖరీదైన చికిత్స నిమిత్తం సుదూర ప్రాంతాలకు వెళ్లేవారని, ఈ నేపథ్యంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు తాయి నితిన్, కార్యదర్శి నాగార్జున, పచ్చి పులుసు రాఘవేంద్ర, శ్రీనివాస్ ప్రశాంత్, కిషోర్ కుమార్ రెడ్డి, రంజిత్, తాయి శ్రీనివాస్, మహేశ్వర్ రెడ్డి, అభినయ్, గణేష్, నామా రఘు, రాజీవ్, రాజశేఖర్ రెడ్డి, సోమశేఖర్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కమతం కాటమయ్య

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లి మండలం యర్రాయపల్లి గ్రామానికి చెందిన కమతం కాటమయ్యను సిపిఐ రైతుసంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. తాను సిపిఐకు రాజీనామా చేస్తున్నట్లు గత నెల 11న కాటమయ్య ప్రకటించారు. అయితే 28వ తేదీన జిల్లా పర్యటనకు వచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కాటమయ్యతో మాట్లాడారు. 29 నుంచి 31వ తేదీ వరకు మదనపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనంలో సత్యసాయి జిల్లాకు చెందిన కమతం కాటమయ్య, బెల్లం మహదేవను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.